స్వచ్ఛతకు పెద్దపీట

- ప్రారంభమైన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం
- మొక్కలు నాటిన ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, మండల ప్రత్యేకాధికారి మహేశ్వరం ఏడీఏ సుజత కోరారు. ఆమనగల్ పట్టణంలో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా ప్రత్యేకాధికారి సుజాత ఎంపీడీఓ కుసుమ మాధురి, మున్సిపల్ కమిషనర్ వసంత, మున్సిపల్ వైస్ చైర్మన్ దర్గయ్య తదితరులు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలో పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అనాజ్‌పూర్‌లో

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అనాజ్‌పూర్‌లో ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి రవీందర్ దత్తు, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ యాదయ్య, భూపాల్‌రెడ్డి, నరసింహముదిరాజ్, బూసకుమార్‌ముదిరాజ్, పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలు

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి పద్మజరమణి, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీలతతో పాటు ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు తీశారు. కాలనీల్లో స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టి, మొక్కలు నాటారు.

మంచాలలో..

మంచాల: గ్రామాల్లో నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరూ భాగ్యస్వామ్యం కావాలని మంచాల మండల ప్రత్యేకాధికారి సుభాషిణి అన్నారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం ప్రారంభించారు. ఆరుట్లలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలశంకర్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రత్యేకాధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామం ముఖ్యం

తలకొండపల్లి: ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి ముత్యాలు కోరారు. తమ ఇంటి పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టి ర్యాలీ నిర్వహించారు. పరిసరాల శుభ్రత, మొక్కల పెంపకం, తదితర వాటిపై గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, ఏఓ రాజు, ఏపీఓ కృష్ణ, కార్యదర్శి సత్యం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు కృషి

మాడ్గుల: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీడీఓ పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె విద్యార్థులతో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనంపై మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలో మండల అధికారులు, ఉపాధ్యాయులు, పంచాయతీకార్యదర్శులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: చౌరస్తాలో మానవహారం చేపట్టిన విద్యార్థులు



అబ్దుల్లాపూర్‌మెట్: మొక్క నాటుతున్న తహసీల్దార్ రవీందర్ దత్తు, మధుసూదన్‌రెడ్డి



మాడ్గుల: అవగాహన ర్యాలీలో ఎంపీడీఓ పద్మావతి



తలకొండపల్లిలో అవగాహన ర్యాలీలో విద్యార్థులు, అధికారులు, నాయకులు



యాచారం: గునుగల్‌లో మొక్క నాటుతున్న ఎంపీడీఓ తదితరులు



మంచాల: ఆరుట్లలో మొక్క నాటుతున్న అధికారులు

క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ సేవలు వినియోగించుకోండి

సంఘం ఆమనగల్లు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి



అన్నదానం ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కడ్తాల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో చేపడుతున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంఘం అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలతో పాటు, ఆరోగ్య వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సామాజిక కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, క్లబ్ సభ్యులు నరేందర్‌రెడ్డి, మహేశ్, రామచంద్రారెడ్డి, రాజేందర్‌యాదవ్, రమేశ్, గోవర్ధన్‌రెడ్డి, బీచ్యానాయక్, గంపశ్రీను, రాంరెడ్డి, పీఆర్‌ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

మైసిగండిలో ప్రత్యేక పూజలు



మైసమ్మ సన్నిధిలోని అధికారులు, నాయకులు

కడ్తాల్: మండలంలోని మైసిగండి మైసమ్మ దేవాలయంలో సోమవారం భక్తులు, అధికారులు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న నాయకులకు పూలమాలలు, శాలువాతో ఆలయ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లచ్చిరామ్‌నాయక్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలతో జాగ్రత్తగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆకతాయిల పట్ల బాలికలు జాగ్రత్తగా ఉండాలని కొంగరకలాన్ శ్రీనివాస మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్కరాజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ శ్రీనివాస స్కూల్‌లో విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో బాలలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లను విద్యార్థుల ఎక్కువగా ఉపయోగించరాదన్నారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ లక్కరాజు రాధిక, షీటీం బృందం తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న చైర్మన్ భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: సంఘంలో సభ్యుడై మృతి చెందిన రైతు కుటుంబానికి బాటసింగారం రైతు సేవా సహకార సంఘం తరఫున సోమవారం రూ.25 వేల నగదును చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అందజేశారు. గతేడాది సెప్టెంబర్‌లో మండలంలోని గుంతపల్లి గ్రామానికి చెందిన కరిమెల జంగయ్య మృతి చెందారు. ఈ మేరకు సంఘం తరఫున అందించే ఆర్థికసాయాన్ని మృతుడి భార్య ఎల్లమ్మకు ఇచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ మహిపాల్ రెడ్డి, నాయకులు జంగయ్య, వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి మేనేజర్ రాకేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

ఇబ్రహీంపట్నం రూరల్: దొంగతనం నేపంతో దళిత మహిళను తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ చేసిన కేసును సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. షాద్‌నగర్ పోలీసులు రాత్రి సమయంలో మహిళను ఠాణాకు పిలిచి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ వ్యవహారంలో పోలీసుల తీరు ఏమాత్రం బాగులేదన్నారు. పోలీసు అధికారులను వెంటనే డిస్మిస్ చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నిరుపేదలకు చేయూత

కడ్తాల్: మండల కేంద్రంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మైసమ్మ, మల్లేశ్, అనసూయ, గాలయ్య, పెంటయ్య, కృష్ణయ్యలను జిల్లా ఎంపీటీసీల సంఘం మాజీ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. బాధితులను అడిగి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు జహంగీర్‌బాబా, లక్ష్మయ్య, మల్లయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

మంచాల మాజీ సర్పంచ్ పాపయ్య మృతి



పాపయ్య (ఫైల్)

మంచాల: మంచాల మాజీ సర్పంచ్ గడ్డం పాపయ్య(61)అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన మరణం తీరని లోటని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వివిధ పార్టీల నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

పేదలందరికీ ఇళ్లు నిర్మించాలి

సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సదానందం



అబ్దుల్లాపూర్‌మెట్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: భూదాన భూముల్లో ప్రొసిడింగ్ పొందిన పేదలందరికి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలని సీపీఐఎంఎల్ (మాస్ లైన్) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గడ్డ సదానందం డిమాండ్ చేశారు. మండలంలోని తారామతిపేట గ్రామంలో సర్వే నంబర్ 235, 236 భూదాన భూముల్లో 2014లో ప్రొసిడింగ్ ఆర్డర్స్ పొందిన పేదలకు పక్కా గృహాలు నిర్మించాలని తహసీల్దార్ రవీందర్ దత్తుకు సోమవారం సీపీఐఎంఎల్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ.. సుమారు 600ల మంది నిరుపేదలకు ప్రొసిడింగ్స్ ఇచ్చినప్పటికీ ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు నిరాకరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు రాజ్యలక్ష్మి, ఎల్.పద్మ, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్, సిటీ అధ్యక్షుడు రాంకుమార్, నాయకులు కృష్ణ, రమ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని రక్షించండి

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని సీపీఎం నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని తట్టిఅన్నారం సర్వే నంబర్ 73లోని సుమారు ఎకరం ప్రభుత్వ భూమిని జె కన్వెన్షన్ యాజమాన్యం ఆక్రమించిందని ఆరోపించారు. ప్రభుత్వ భూమి గుండా 40 అడుగుల రోడ్డును కన్వెన్షన్ హాలుకు వేశారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు రోడ్డును కన్వెన్షన్ హాలు యాజమాన్యం పక్కనున్న ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి లీజుకు ఇచ్చిందని సీపీఎం నాయకులు తహసీల్దార్ రవీందర్ దత్తు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏర్పుల నర్సింహ, శివకుమార్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

బాలింతల శ్రేయస్సుకు కృషి

యాచారం: మండలంలోని తక్కళ్లపల్లి తండాలో సోమవాం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ వారోత్సవాలకు మండల ప్రత్యేకాధికారి పద్మజరమణి హాజరై మాట్లాడుతూ.. తల్లి పాల ప్రాముఖ్యతపై మహిళలకు వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల శ్రేయస్సు కోసం ఐసీడీఎస్ ఎంతో కృషి చేస్తుందని అన్నారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పలువురు ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాల్లో పద్మజరమణి

మార్మోగిన శివనామస్మరణ

మొయినాబాద్‌రూరల్: శివనామస్మరణతో కనకమామిడి సంగమేశ్వర దేవాలయం మార్మోగింది. శ్రావణమాసం మొదటి సోమవారం కావడంతో వేదపండితులు, ఆలయ అర్చకులు కలిసి ఉదయాన్నే గణపతి హోమం, రుద్రాభిషేకం నిర్వహించి నైవేద్యం సమర్పించి మహామంగళహారతి నిర్వహించారు. మొదటిరోజు సోమవారం కావడంతో చుట్టు పక్క గ్రామాలతో పాటు జంట నగరాల నుంచి ఇతర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి క్యూలైన్‌లో స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులకు వేదపండితులు, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

11న పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో ఊర పోచమ్మ ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ నెల 10వ తేదీన హోమాలు, గణపతి పూజ, 11న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, బోనాలు సమర్పిస్తారని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పాండు రంగారెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, పెంటాచారి, పాండు, యాదయ్య, జంగయ్యగౌడ్, రమేష్, శ్రీనివాస్, చంద్రయ్య, కృష్ణ, బీరప్ప, మారయ్య పాల్గొన్నారు.



ఆరుట్లలో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న గ్రామపెద్దలు

సాగర్ హైవేపై వాహనాల తనిఖీ

యాచారం: నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై సోమవారం ఇబ్రహీంపట్నం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనూష వాహనాల తనిఖీలు చేపట్టారు. యాచారం, గునుగల్, మాల్ కేంద్రాల్లో వాహనాల తనిఖీలు చేపట్టి డ్రైవర్ల లైసెన్స్‌లు, ఆర్‌సీలు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసి యాచారం పోలీసులకు అప్పగించారు.

వసతిగృహాన్ని తనిఖీ చేసిన ఏటీడీఓ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏటీడీఓ వెంకటయ్య

కడ్తాల్: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ వసతి గృహంతో పాటు, ఆశ్రమ పాఠశాలను సోమవారం రాత్రి జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి ఏటీడీఓ ఉడుతనూరి వెంకటయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అడిగి వసతి గృహ సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని వసతి గృహ సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహారాన్ని పరిశీలించారు.

వర్గీకరణపై న్యాయమైన ముగింపు

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

చేవెళ్ల: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా దేశంలో జరుగుతున్న పోరాటానికి సుప్రీంకోర్టు న్యాయమైన ముగింపునిచ్చిందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ అన్నారు. చేవెళ్లలో సోమవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 1న వర్గీకరణ అమలు జరపాలని రాష్ట్రాలకు అధికారికంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. టపాకాయలు కాల్చుకుంటూ సంబరాలు చేశారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇప్పటివరకు ఇచ్చిన నోటిఫికేషన్‌లలో వర్గీకరణను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరేశ్, హరీశ్, రాజు, పవన్, శేఖర్ ఉన్నారు.

తండాలకు బీటీ రోడ్ల నిర్మాణం



ఆమనగల్లు: ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



తలకొండపల్లి: తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని అన్ని గిరిజన తండాలకు బీటీ రోడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. కల్వకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా తీర్చి దిద్దడమే తన లక్ష్యమన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం మండలంలోని దయ్యాలబోడు తండాకు చెందిన పలువురు గిరిజన యువకులు ఆయన్ని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డికి దయ్యాల బోడు తండా వరకు బీటీ రోడ్డు నిర్మించాలని వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. అన్ని గిరిజన తండాలు, గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మించడమే తమ లక్ష్యమన్నారు. ఇటీవల కల్వకుర్తి పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరినట్లు చెప్పారు. తండాలలో మౌలిక వసతులు కల్పించి గిరిజనుల కష్టాలు దూరం చేస్తానని వివరించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌రాథోడ్, రాజునాయక్, శ్రీనునాయక్, రాజేశ్‌నాయక్, విజయ్‌నాయక్, వినోద్‌నాయక్, సాయి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ సంబురాలు

తలకొండపల్లి: మండలంలోని తాళ్లగుట్ట తండాలో గిరిజనులు సోమవారం తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన మొలకల బుట్టలను గిరిజన మహిళలు, యువతులు తలపై పెట్టుకొని డప్పుల చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించి భవాని మాతకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పండుగలు తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రమేశ్‌యాదవ్, నర్సింహ పాల్గొన్నారు.

సమయ పాలన మార్చాలి

మంచాల: మండలంలోని బండలేమూర్ గ్రామానికి వచ్చే ఆర్టీసీ బస్సుల సమయ పాలన మార్చాలని సీపీఎం జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ నర్సప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నుంచి బండలేమూర్ గ్రామానికి వచ్చే ఆర్టీసీ బస్సులు సమయ పాలన లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఉదయం అదనంగా బస్సులు నడిపించాలన్నారు. దీనికి డీఎం పరిశీలన చేస్తామని తెలిపినట్లు ఆయన తెలిపారు.



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణ

నీళ్లు లేక.. అవసరాలు తీరక !

ఎస్టీ హాస్టల్ విద్యార్థినులకు కష్టాలు

ఇబ్రహీంపట్నం: ఎస్టీ బాలికల హాస్టల్‌లో నీటి సమస్య విద్యార్థినులను వేధిస్తోంది. గత నాలుగు రోజులుగా నీళ్లు లేక బాలికలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అయినా అధికారులు స్పందించడం లేదని సోమవారం హాస్టల్‌ను సందర్శించిన ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు విద్యార్థినీల సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. బోరు మోటారు పాడవ్వడంతో నీటి కోసం రెండు మూడురోజులుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని స్థానిక తహసీల్దార్ సునీత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తాత్కాలికంగా వార్డెన్ వాటర్ ట్యాంకర్‌ను తెప్పించి విద్యార్థినుల నీటి సమస్యను కొంత మేరకు తీర్చారు. హాస్టల్‌లో నీటి సమస్యను వెంటనే పరిష్కరించకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, తరంగ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



నీళ్ల కోసం హాస్టల్ బయటకు వచ్చిన విద్యార్థినులు